వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 140 గురువారం | 30 నవంబర్ 2023 | పేజీలు : 07 | వెల రూ. 5

## ఓటు మన హక్కు



### తప్పనిసరిగా వినియోగించుకోవాలి

### రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి పార్థసారథి

ప్రతీ ఐదేళ్లకు ఒక సారి వచ్చే శాసన సభ ఎన్నికల్లో మీ శక్తి వంతమైన ఓటు ఆయుధాన్ని తప్పక వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి సి.పార్థసారథి ఓటర్లకు పిలుపునిచ్చారు. బంజారాహిల్స్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాధారణ ఓటరుగా క్యూ లైన్‌లో నిలిచి తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పటిష్ఠతకు ప్రతీ ఒక్కరూ ఓటు వేయాలని సూచించారు.

– వరంగల్ వాయిస్, హైదరాబాద్




కరీమాబాద్ కౌటిల్య పాఠశాల బూత్ నంబరు 184 లో బారులు తీరిన ఓటర్లు

వివరాలు 2, 7లో..

# హమ్మయ్య..

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఊపిరి పీల్చుకున్న అధికారులు, పోలీసులు
- పలు ప్రాంతాల్లో చెదరుముదురు ఘటనలు
- 3 గంటల తర్వాత ఒక్కసారిగా పోటెత్తిన ఓటర్లు
- ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 12 నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దీంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెదరుముదురు ఘర్షణలు జరిగినా పోలీసులు వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. అయితే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మాత్రం సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. అనేక ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు మందకోడిగా సాగిన పోలింగ్ 3 గంటల తర్వాత ఒక్కసారిగా ఓటర్లు పోటెత్తడంలో ఊపందుకుంది. క్యూ లైన్లు ఓటర్లతో కిక్కిరిసిపోయాయి. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో పోటీ చేసిన 189 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలో నిక్షిప్తమైంది. డిసెంబర్ 3న జరుగనున్న కౌటింగ్ లో ఎవరు విజేతలో తేలనుంది. - వరంగల్ వాయిస్, వరంగల్





### ఓటు హక్కు వినియోగించుకున్న..

### వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి

వరంగల్ వాయిస్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్ గడ్డం కేశవమూర్తి గురువారం కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో కేశవమూర్తితోపాటు వారి శ్రీమతి సంధ్యారాణి, కుమారుడు గడ్డం సాహిత్, కూతురు ఉషశ్రీ లు పశ్చిమ నియోజకవర్గంనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వారికి ఓటు వేశారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ

గురువారం 30, నవంబర్ 2023
www.warangalvoice.net

# హమ్మయ్య..

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**ఊపిరి పీల్చుకున్న అధికారులు, పోలీసులు**

**పలు ప్రాంతాల్లో చెదరుముదురు ఘటనలు**

**3గంటల తర్వాత ఒక్కసారిగా పోటెత్తిన ఓటర్లు**

**ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మూడో సారి జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో 189 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఉదయం నుంచే ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివస్తారని భావించినా ఎక్కడా అలాంటి వాతావరణం కనిపించలేదు. కొన్ని కేంద్రాల్లో ఉదయం 9గంటల వరకు కూడా ఒక్కరూ రాకపోవడంతో వెలవెలపోయాయి. రెండు గంటల పాటు కేవలం ఐదు శాతం మాత్రమే పోలింగ్ కావడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఇదే పరిస్థితి మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా సాగింది. ఒక్కొక్కరుగా మాత్రమే వచ్చి ఓటు వేసి పోవడంతో పోలింగ్ కేంద్రాల వద్ద పెద్దగా సందడి నెలకొనలేదు.

### డబ్బులిస్తేనే..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాత్రం వింత పరిస్థితి కనిపించింది. డబ్బులిస్తేనే ఓటు వేస్తామంటూ భీష్మించడంతో పోలింగ్ కేంద్రాలు జనం లేక వెలవెలపోయాయి. పోలింగ్ కేంద్రానికి కూతవేటు దూరంలోనే భారీ సంఖ్యలో ఓట్లు మోహరించినా ఓటు వేసేందుకు మాత్రం పోలింగ్ కేంద్రాలకు రాలేదు. మధ్యాహ్నం తర్వాత కొంత మంది ఓటర్లకు డబ్బులు అందడంతో ఒక్క సారిగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. దీంతో పలు కేంద్రాలు ఓటర్లతో కిక్కిరిసి పోయాయి. వారిని కంట్రోల్ చేయడం అక్కడున్న సిబ్బందికి తలకు మించిన భారంగా మారింది.

### 3 గంటల తర్వాత..

ఉదయం నుంచి మందకోడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం 3 గంటల తర్వాత అనూహ్యంగా పెరిగింది. ఒక్కసారిగా ఓటర్లు పోటెత్తడంతో పోలింగ్ కేంద్రాలు జనంతో కిక్కిరిసి పోయాయి. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారందరికీ ఓటు వేసేందుకు



అనుమతించారు. మధ్యాహ్నం వరకు 25నుంచి 30శాతం వరకే పోలింగ్ జరుగగా ఆ తర్వాల ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది.

### ఓటు వేసిన ప్రముఖులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, ఎర్రబెల్లి దయాకర్ రావు, దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణా రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, రెడ్యానాయక్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, డోర్నకల్ ఎంపి మాలోతు కవిత, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్లు పి.ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, ఇలా త్రిపాఠి, సీహెచ్ శివలింగయ్య, కె.శశాంఖ, భువేశ్ మిశ్ర, వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

















**ఓటు హక్కును వినియోగించుకున్న కడియం శ్రీహరి కుటుంబ సభ్యులు, బండా ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి కుటుంబ సభ్యులు**



శివనగర్ లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన అనంతరం కొండా సురేఖతో మాజీ కార్పొరేటర్ శ్యామంతుల ఉషాశ్రీనివాస్



వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని శివనగర్ ప్రకాష్ మెమోరియల్ హై స్కూల్ లో బీజేపీ సీనియర్ నాయకుడు గంట రవికుమార్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# శ్రీ కుంకుమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ప్రసిద్ధ శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవ పూర్వక వజ్రగధిత పాశుపత మహా రుద్ర యాగ సహిత ఆకాశ దీపోత్సవ మహా అన్నదాన మహోత్సవాలు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్ కుమార్ శర్మ ఆచార్యత్వమున అత్యంత వైభవంగా నిర్వహించారు. నిత్య అన్నదాన కార్యక్రమాల్లో భాగంగా గురువారం మహారాష్ట్రకు చెందిన తౌటం ప్రీతి-ప్రసాద్ దంపతులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అల్పాహార కార్యక్రమ దాత పరకాలకు చెందిన పుల్లూరి భాగ్యలక్ష్మి-సమ్మయ్య, టుంబ సభ్యులుపుల్లూరి స్వాతి -సాయి కృష్ణ దంపతులు స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా అన్నదానం చాలా





గొప్పదని, దేవతలకు అతి శ్రేష్టమైన మాసం, కార్తీక మాసం ఈ శ్రేష్టమైన మాసంలో అన్నదానం చేస్తే అతి పుణ్యమని స్వామివారిని దర్శించుకుంటే సమస్త పాపాలు తొలగి స్వర్గ ప్రాప్తి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తో పాటు ధర్మకర్తల మండలి ఆలయ వంశానుగత అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణ శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటయ్య, భక్తులు పలువురు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న టీఎన్‌జీఓస్ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా టీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరీ సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణు గోపాల్, శనిగరపు శ్యామ్ సుందర్, లక్ష్మి ప్రసాద్ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగ పరుచుకోవాలి అని పిలుపునిచ్చారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ట్రాన్స్ జెండర్లు

**వరంగల్ వాయిస్, కాటారం :** అసెంబ్లీ సాధారణ ఎన్నికలలో భాగంగా మంథని నియోజకవర్గం కాటారం మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ లో ట్రాన్స్ జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు విలువ ప్రతి ఒక్కరు గుర్తించాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## నానమ్మతో కలిసి ఓటేసిన నవ ఓటర్లు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ శాసనసభకు జరుగుతున్న ఎన్నికలలో గురువారం మొదటిసారిగా ఓటు హక్కు వారి నానమ్మతో కలిసి ఓటు వేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశిబుగ్గలోని 20వ డివిజన్ లో పోలింగ్ బూత్ నెంబర్ 90లో మొదటిసారిగా మా కుటుంబానికి పెద్ద అయిన మా నాన్నమ్మతో ఓటు వేయడం మాకుసంతోషంగా ఉందని వారు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి:** తెలంగాణ వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. అక్కడక్కడా ఈవీఎం మిషన్లు మొరాయించినా.. మెజార్టీ స్థానాల్లో చురుగ్గా సాగుతోంది. ఇదీలా ఉండగా.. పోలింగ్ వేళ హనుమకొండ సిద్దిపేట జిల్లాలో కలుపుకొని ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో డబ్బుల పంపిణీ లో గొడవలు జరిగే సంఘటనలు చోటుచేసుకుంది. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్, వంగర, భీమదేవరపల్లి, మాణిక్యపూర్, కొత్తపల్లి, రత్నగిరి, గట్లనర్సింగపూర్, కొత్తకొండ, ధర్మారం, మల్లారం, రసూల్ పల్లి పోలింగ్ కేంద్రం వద్ద నగదు పంపిణీ కలకలం రేపింది. వివిధ పార్టీల కార్యకర్తలు ఓటు వేసే కొందరికి డబ్బులు ఇవ్వలేదని పక్క ఇంటికి ఇచ్చారని పోలింగ్ కేంద్రాల్లో గొడవలు చేశారు. దీనిపై అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

## ఉత్సాహంగా ఓటేసిన యువత



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని యువత ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 15వ వార్డు కౌన్సిలర్ చందుపట్ల సాయి సుజాత ఇద్దరు పిల్లలు డాక్టరేట్ చేస్తున్నారు. వారు ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. యువత ఓటు హక్కు వినియోగించడం వలన బంగారు భవిష్యత్తు యువత చేతిలో ఉంటుందన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం




### గులాబీ పార్టీ బలహీనంగా ఉన్న స్థానాల్లో బీజేపీకి మద్దతు
### కాంగ్రెస్ ఓట్లను కొల్లగొట్టేందుకు భారీ స్కెచ్

**వరంగల్ వాయిస్, డోర్నకల్:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడవసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికలు.. ప్రజలకు ప్రజాప్రతినిధుల మధ్య జరిగిన పోరులా కనిపించింది. దళిత బంధు, బీసీ బంధు, రైతుబంధు, డబుల్ బెడ్ రూములు లాంటి పథకాలు అందని ప్రజలు ఈసారి బీఆర్ఎస్ ను ఓడించాలని కసిగా ఓటు వేశారు. ఇది జరుగుతందని నెల ముందే పసిగట్టిన బీఆర్ఎస్ తమ కారును రిపేర్ చేసే దిశగా అడుగులు వేసింది. బీఆర్ఎస్ పార్టీ కష్టం పరిస్థితులలో ఉందని గ్రహించిన బీఆర్ఎస్ పార్టీ బంధువు బీజేపీ.. తన ప్రధాన శత్రువు అయిన కాంగ్రెస్ ను మరో మారు తొక్కే ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా లోపాయికార ఒప్పందాలతో బీజేపీ బలంగా ఉన్న స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ డమ్మి అభ్యర్థులుగా నిలబెట్టాలని సూచించింది. ప్రతిఫలంగా బీఆర్ఎస్ బలంగా ఉన్న స్థానాలలో తాము కూడా బలహీన అభ్యర్థులను నిలబెట్టి కాంగ్రెస్ ఓటు బ్యాంకును కొల్లగొట్టే ప్రయత్నం చేస్తామన్నాది.. చేసింది. తెలంగాణలో గెలుపొందిన ఎంపీలు పార్లమెంట్‌లో తమకు అనుకూలంగా ఉండాలనే ఒప్పందం వీరి మధ్య జరిగింది. బీజేపీతో పాటు బీఎస్పీ పార్టీలు ఐదు శాతం ఓటర్లను తమ వైపు మలుచుకున్నారు.. క్యాడర్ బలాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందనే సంకేతాలు ఇప్పటికే పార్టీ వర్గాల నుంచి వారికి అందగా బీజేపీ, బీఎస్పీల కార్యకర్తలు, నాయకులు తమ ఓట్లను ట్రాన్స్ ఫర్ కాకుండా తమ తమ పార్టీలకే ఓటు వేశారు. డోర్నకల్ నియోజకవర్గంలో 2,19,264 మంది ఓటర్లు ఉండగా ఇందులో నుండి దాదాపు 1.80 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ప్రతి ఓటర్ కు 1500చొప్పున డబ్బులు ఓ పార్టీ తరపున అందాయి అనేది జగమెరిగిన సత్యం. చెక్‌పోస్ట్‌లు, స్కాడ్, నిఘా తదితర వాటిని దొరకకుండా 70 శాతం ఓటర్లకు ఈ డబ్బులు చేరాయి. ఉదాహరణకు 1.5 లక్షల మందికి ఓటర్లకు రూ.1500చొప్పున లెక్కేస్తే దాదాపు రూ.22 కోట్ల రూపాయలు ఓ అభ్యర్థికి ఖర్చయ్యాయి. ఇవే కాకుండా సభలు సమావేశాలు నామినేషన్లకు, వాహనాలు వగైరా వాటికీ మరో రూ.10 కోట్లు ఖర్చు అయ్యాయి. ఓ ఎమ్మెల్యే అభ్యర్థి తాను పోటీ చేస్తే రూ.40కోట్లు ఖర్చు చేయాల్సిన ప్రస్తుత పరిస్థితులలో తాను ఖర్చు చేసిన రూ.40కోట్లు తిరిగి సంపాదించాలంటే ప్రతి ఏడాది రూ.10 కోట్లు కచ్చితంగా సంపాదించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిఫలంగా నాణ్యత లోపించే రోడ్లు, భవనాలు, ప్రభుత్వ పథకాల్లో అవినీతి లాంటివి కొనసాగుతున్నాయి.. సంవత్సరానికే పగిలిపోయిన రోడ్లపై, 10 సంవత్సరాలకే కూలటానికి సిద్ధంగా ఉన్న భవనాలు, ఏడు సంవత్సరాలైనా ఎదగని హరితహారం చెట్లు, పనికిరాని పార్కులు, ప్రకృతి వనాలు, క్రీడలకు వినియోగించని మైదానాలు, వినియోగానికి రానీ డబుల్ బెడ్‌రూములు లాంటివి చూస్తూ ఐదు సంవత్సరాలు బాధపడుతూ తిరిగి ఎన్నికలు ఎప్పుడు వస్తే మా డబ్బులు ఎక్కడ.. ఎంతిస్తున్నారు.. అనే ప్రశ్నలతో తిరిగి ఎన్నికలకు సిద్ధమవుతున్నాం మనం.




# చేతి వేలికి ఇంకు.. ఈవీఎంలో ఓటు



























# మీరేసిన ఓటే.. మీ భవిష్యత్






























# లుట్‌పుట్ గయా..

షారూక్ ఖాన్, రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'డంకీ' రీసెంట్‌గా 'లుట్ పుట్ గయా..' అనే సాంగ్‌ను 'డంకీ డ్రాప్ 2'గా మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హార్డీ పాత్రలో షారూక్, మను పాత్రలో తాప్సీ మధ్య ఉండే ప్రేమను తెలియజేసే ఈ పాట ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందనను రాబట్టుకుంది. ఫ్యాన్స్, సినీ ప్రేక్షకులతో పాటు సంగీతాభిమానులు సైతం ఈ పాటకు ఫిదా అయ్యారు. క్రిస్మస్ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున డిసెంబర్ 21న ఈ సినిమా రిలీజ్ కానుంది. అయితే 'జవాన్' సినిమాలో కుస్తీ గ్రౌండ్ మ్యాజిక్‌ను మరోసారి షారూక్ 'డంకీ'లోనూ తాప్సీతో రిపీట్ చేస్తున్నారు. ఈ విషయం తెలిసి నెటిజన్స్ కొందరు సోషల్ మీడియాలో 'జవాన్'లో దీపికాతో.. 'డంకీ'లో తాప్సీతో.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు. షారూక్, దీపిక ల మధ్య 'జవాన్' మూవీలో చూపించిన కుస్తీ సీన్ ఎంత పాపులర్ అయ్యిందో తెలియంది కాదు. ఇప్పుడు అదే మ్యాజిక్‌ను డంకీలోనూ రిపీట్ చేయబోతున్నారు కింగ్ ఖాన్. హీరోయిన్స్ అందరూ షారూక్ ఖాన్‌తో కుస్తీ చేయాలంటూ నెటిజన్ ఒకతను పోస్ట్ చేశారు. 'డంకీ' చిత్రంలో టాలెంటెడ్ ఆర్టిస్టులు ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. బోమన్ ఇరాని, తాప్సీ పన్ను, విక్కీ కౌశల్, విక్రమ్ కొచ్చర్, అనీల్ గ్రోవర్ సహా బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్ ప్రేక్షకుల హృదయాలను దోచుకోనున్నారు. ఏ జియో స్టూడియోస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్, రాజ్‌కుమార్ హిరాణి ఫిల్మ్స్ బ్యానర్స్ సమర్పణలో రాజ్ కుమార్ హిరాణి, గౌరి ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# పనమ్మాయి కోసం అల్లు అర్జున్ ..



## ఫాలోవర్లు పెరగాలని ఆశిస్తున్నట్లు వెల్లడి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఎంతోమంది హృదయాలను గెలుచుకున్నారు. తను ఒక పెద్ద స్టార్ అయి ఉండీ కూడా, తన ఇంట్లో పనిచేసే ఒక అమ్మాయికి ఫాలోవర్లు పెరగాలని ఉద్దేశంతో ఆ అమ్మాయితో ఒక చిన్న వీడియో చేసి, ఆమెకి ఎక్కువ ఫాలోవర్లు పెరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ వీడియో చూసిన ప్రతి ఒక్కరు అల్లు అర్జున్ ని అభినందించకుండా ఉండలేకపోతున్నారు. ఆమె తన ఫాలోవర్లు ని పెంచుకోవాలని అనుకుంది, అందుకు ఆమె అందుకు తన యజమాని అయిన అల్లు అర్జున్ ని అడిగింది, అతను కూడా సరే అన్నాడు. ఆమెకి ఇప్పటికే పదమూడువేలమంది ఫాలోవర్లు వున్నారని, ఈ అల్లు అర్జున్ వీడియోతో అవి 30 వేలకు పైగా అవుతాయని అనుకుంటున్నట్టుగా చెప్పింది ఆమె. అల్లు అర్జున్ కూడా ఆమెకి బాగా ఫాలోవర్లు పెరగాలని ఆశిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం 'పుష్ప 2' సినిమాతో బిజీగా వున్నా అల్లు అర్జున్, తన ఇంట్లో పనిచేసే అమ్మాయిని పాపులర్ చెయ్యడం కోసం ఈ చిన్న వీడియో చెయ్యడంతో అల్లు అర్జున్ అందరి హృదయాల్ని గెలుచుకున్నారు. ఇప్పుడు ఇది సాంఘీక మాధ్యమంలో విపరీతంగా వైరల్ అవుతోంది.

# ఇంటివాడైన రణ్‌దీప్ హుడా



ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడా ఓ ఇంటివాడయ్యాడు. మోడల్, నటి లిన్ లైస్రామ్‌ను ఆయన ప్రేమ వివాహం చేసుకున్నాడు. మణిపూర్ రాజధాని ఇంపాల్ లోని ఓ దేవాలయంలో వీరి వివాహం నిరాడంబరంగా జరిగింది. మణిపూర్ సంప్రదాయం ప్రకారం ఈ జంట ఒక్కటైంది. ఈ మేరకు పెళ్లి విషయాన్ని తెలియజేస్తూ సోషల్ మీడియా ద్వారా రణ్‌దీప్ హుడా ఫోటోలను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు, పలువురు ప్రముఖులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'మహాభారతంలో మణిపూర్ యువరాణి చిత్రాంగదను అర్జునుడు ఎక్కడ వివాహం చేసుకున్నాడో.. అక్కడే మేము ఒక్కటి కాబోతున్నాం. ఈ నెల 29న ఇంపాల్‌లో కుటుంబసభ్యులు, సన్నిహితులు సమక్షంలో మా (రణ్‌దీప్ హుడా, లిన్ లైస్రామ్) పెళ్లి జరగనుంది. త్వరలోనే ముంబయిలో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నాం. మా ప్రయాణానికి మీ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాం' అని రణ్‌దీప్ హుడా ఇన్‌స్టాలో రాసుకోచ్చాడు. 2001లో రిలీజైన మన్‌సూన్ వెడ్డింగ్ సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు రణ్‌దీప్ హుడా. ఇక ఆయన నటించిన చిత్రాలలో 'జిస్మ్ 2', 'బాంబే టాకీస్', 'కిక్', 'హైవే' సినిమాలు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇక ప్రస్తుతం బీజేపీ ప్రాపగాండా మూవీ 'స్వతంత్ర వీర్? సావర్కర్' చిత్రంలో నటిస్తున్నాడు.





# క్యాప్షన్ పెట్టు టికెట్ పట్టు

## సలార్‌కు ఉచిత టిక్కెట్లు

రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులకు, ప్రేక్షకులకు ఓ సువర్ణ అవకాశం! ఆయన నటిస్తున్న తాజా సినిమా 'సలార్' సినిమాను ఫస్ట్ డే ఫస్ట్ షో చూడాలని ఆశ పడుతున్నారా? ఆ షోకి 'సలార్' టీ షర్టులు, క్యాప్ ధరించి వెళితే బాగుంటుందని ఆలోచిస్తున్నారా? అటువంటి వాళ్ళ కోసమే ఈ అవకాశం! సలార్' చిత్రీకరణలో ప్రభాస్కు తన ఫోనులో దర్శకుడు ప్రశాంత్ నీల్ ఏదో చూపిస్తున్న ఫోటోను చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ ఫోటోకి క్యాప్షన్ ఇవ్వమని అభిమానులను కోరింది. బెస్ట్ క్యాప్షన్ ఇచ్చిన టాప్ 5 నెటిజనులకు తమ తమ ఏరియాలో 'సలార్' ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్స్ ఇస్తామని పేర్కొంది. అంతే కాదు... మర్చండైజ్ కూడా అందిస్తామని వివరించింది. మరికొన్ని గంటల్లో 'సలార్' ట్రైలర్ రిలీజ్ కానుంది. శుక్రవారం... అనగా డిసెంబర్ 1న రాత్రి 7.11 గంటలకు యూట్యూబ్‌లో విడుదల చేయనున్నారు. ట్రైలర్ విడుదలకు ముందు ఈ ఆఫర్ ఇవ్వడమే కాదు... బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్టోరీ కూడా లీక్ చేశారు దర్శకుడు ప్రశాంత్ నీల్!



# ఉద్రిక్త ఎన్నికలు

## పలు ప్రాంతాల్లో ఘర్షణలు

## పట్టణాల్లో పడిపోయిన పోలింగ్ శాతం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ పట్టణ ప్రాంతాల్లో మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ క్రమంగా ఊపందుకోంది. అయితే ఓటమి భయంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద దాడులకు తెగబడ్డారు. డోర్నకల్ మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో పరస్పరం కవ్వింపుతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. మల్లాయికుంట తండా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మధ్య ఓటు విశయంలో తలెత్తిన వివాదం పరస్పర దాడులకు దారి తీసింది. ఇరు పార్టీలు బట్టలు చించుకునేలా కొట్టుకున్నారు. దీంతో సుమారు రెండు గంటల పాటు గ్రామంలో టెన్షన్ వాతావరణం నెలకుంది. గ్రామంలో పోలీసులు చేరుకొని బందోబస్తు నిర్వహించారు. డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వీరన్న సోమ్లతండాకు చెందిన యువకులతో వాగ్వాదం చేశారు. ఓ సందర్భంగా చెట్టుకొమ్మ విరిసి దాడికి యత్నించిన విడియో సమాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.

### తూర్పులోనూ..

వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెరుక వాడ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ వద్ద జరిగిన ఘర్షనలో ఇద్దరు యువకులకు తలకు గాయాలయ్యాయి. దీంతో గాయపడిన వారిని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ పరామర్శించారు. అయితే చివరి నిమియంలో ఓటు వేసేందుకు వచ్చిన యువకులతో పోలీసులు వాగ్వాదానికి దిగడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారి దాడుల వరకు చేరుకుంది. అదే విధంగా 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీలోని గ్రేన్ మార్కెట్ స్కూల్ పోలింగ్ కేంద్రంలోనూ గొడవ జరిగింది. ఖిలా వరంగల్ మధ్యకోటలోనూ బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య బాహాబాహీ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు దూషనలకు దిగారు. దీంతో రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది.

కరీమాబాద్ లోని ఎస్ ఆర్ వై స్కూల్ లోని పోలింగ్ బూత్ లో తాము ఓటు వేయకుండానే వేసినట్లు ఉందని ఆరోపిస్తూ మహిళలు ఆందోళన చేశారు.





# సిగ్గులేదా..

## నన్నపునేనిపై నోరు పారేసుకున్న సురేఖ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎదురుపడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్ పై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖతోపాటు ఆమె కూతురు సుష్మితా పటేల్ నోరు పారేసుకున్నారు. బీజేపీ అభ్యర్థితో జత కట్టేందుకు సిగ్గులేదా అందూ నిగ్గదీశారు. ఈ స్థాయికి తీసుకు రావడానికి కారణం ఎవరో తెలువదా..? బాబు ఎవరు.. ఇండ్లలోకి పోయి బెదిరిస్తారా అంటూ నిలదీశారు. నా దగ్గర వీడియో ఉంది. మీరు బయపెట్టుడు, బెదిరించుడు చేస్తే చెప్పు తెగుంది అంటూ హెచ్చరించారు. మీ బతుకు ఒక బతుకులేనా అంటూ నిలదీశారు.



మొదటిసారిగా ..

మంథని నియోజకవర్గం కాటారం మండల కేంద్రంలోని 148 పోలింగ్ కేంద్రంలో గాదె హిమబిందు మొదటిసారిగా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.
– వరంగల్ వాయిస్, కాటారం



వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఎస్ఆర్ ఆర్ తోటలోని పోలింగ్ బూత్ నెంబర్ 111 లో ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్ జెండర్లు.



ఓటు హక్కును వినియోగించుకున్న జనగామ జిల్లా కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి సీహెచ్.శివలింగయ్య




మహబూబాబాద్‌లో జిల్లా కేంద్రంలో కలెక్టర్ శశాంక సాధారణ పౌరుడిగా క్యూలైన్ లో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న గ్రేటర్ వరంగల్ కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారి షేక్ రిజ్వానా బాష

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com